# కమల కాపురం

ఆర్. జనాబాయి

మాలతి రాట్నం బెట్టుకొని దారముతీస్తూ, "రఘుపతి రాఘవ రాజారాం-పతితపావన సీతారాం" అని గొణుక్కుంటూ కూర్చుంది. మాలతికి పిల్లలు లేరు. అందుకని పనిగూడాలేదు. ఇంతలో కమల అక్కయ్యా! ఏంచేస్తున్నావనుకుంటూ వచ్చింది.

మాలతి:—దారం తీస్తున్నాను.

కమల:—అక్కయ్యా! నీ పని మంచిపని. పిల్లల్తో నాకు తీరికేవుండదు. ఏం చెయ్యను? ఇవ్వాళ్ల పిల్లలు మా అమ్మ యింటికి వెళ్ళారు. నా పనీ కొంచెం తెమిలింది. కాస్సేపు నీ దగ్గర కాలక్షేపం చేద్దామని వచ్చాను. ఈ దారంతో యేంచేస్తా రక్కయ్యా!

మాలతి:—బట్టలు నేయించుకుంటారు. గాంధీమహాత్ముడు 'నిర్మాణకార్యక్రమము' అనే పుస్తకం వ్రాశాడు. దాన్ని చదివితే అన్ని విషయాలూ తెలుస్తై. కాని, కమలా! నీవు చాలా చిక్కిపోతున్నావెందుకమ్మా!

కమల:—ఏం చెయ్యనక్కయ్యా! మాకు జీతం సరిపోదు. భోజనానికుంటే, గుడ్డకుండదు. గుడ్డకుంటే భోజనానికుండదు. అక్కయ్యా! మరోమాట.

మాలతి:—ఏమిటి కమలా చెప్పు! నీకేం సహాయం కావాలి? నా చేతనైతే తప్పక చేస్తాను.

కమల:—అక్కయ్యా! నా కిరవై రూపాయలుంటే యివ్వు. చీరకొనుక్కుంటాను. నెలకు రెండు రూపాయల చొప్పున నీ అప్పు తీరుస్తాను.

మాలతి:—(కొంచెంసేపు ఆలోచించి) కమలా! నే నొకమాట చెప్తాను. కోపగించుకోకు. పది నెలలు నాకు డబ్బు చెల్లించేదాని కంటే రోజుకు రెండు గంటలు దారం తీయటం కోసం వినియోగించావా పది నెలల్లో నీకు అయిదు చీరెలు తయారౌతవి. ఆ మిల్లు చీర కొంటే నాకు డబ్బు చెల్లించినన్ని రోజులైనా అగదు చెల్లీ!

కమల:—మరేం చెయ్యమంటా వక్కయ్యా! నా దగ్గర రాట్నంలేదు. అదీగాక, నాకు దారం తీయటం గూడా రాదు.

మాలతి:—అయితే. నే చెప్పినట్లుచేయి. రోజూ మధ్యాహ్నం ఒంటి గంటకు నా దగ్గరికివచ్చి మూడు గంటల వరకూ రాట్నం వడుకు. రాట్నం నే నిస్తాను. రెండు నెలలలో రెండురూపాయల మూదితో నీకు యిరవై రూపాయల చక్కని చీరె యిప్పిస్తాను.

కమల:—మంచి దక్కయ్యా! తప్పక వస్తాను.

ఆవిధంగా కమల రోజూ మధ్యాహ్నం మాలతి యింటికివచ్చి దారం తీస్తుండేది. ఇలా రెండు నెలలు గడిచినై. కమల తీసిన దారంతోనే ఒక చీరె, ఒక ధోవతుల జతా మాలతి యిప్పించింది. మరునాడు సంవత్సరాది పండుగకు కొత్త చీర యిప్పించ లేనన్నాడు కమల భర్త. చీరెవెల 20 రూపాయల కంటే తక్కువలేదు. కమల భర్త రామారావు. లలితా మోహనులు కమల సంతానం.

రామారావు:—కమలా! నా దగ్గర యిరవై రూపాయలే ఉన్నై. వాటితో పిల్లలకు బట్టలు తెస్తాను. మనకు బట్టలేక పోయినా చింతలేదు. ఉన్నవే కట్టుకుందాం. పిల్లలూరుకోరుగా మరి? తోటి పిల్లలనుచూచి మారాం చేస్తారు. సరే నేను బజారుకు వెళ్తాను.

కమల:—మంచిది టీ త్రాగి వెళ్ళండి. నాలుగు గంటలైంది.

రామారావు:-సాయంత్రమైపోయింది. మరి యెపుడు చేస్తావు? పగటినిద్ర వద్దంటే వినవు. తీరా నేను నాలుగు గంటలకు వచ్చేటప్పటికి టీ తొందర.

కమల;-నేను పగటి నిద్రమాని నాలుగు నెలలైంది.

రామారావు:—మరి పగలంతా ఏంచేస్తున్నావు? ఇరుగు పొరుగుతో ముచ్చటలేగదూ! ఇంతకంటే నీవు చేసే పనేముంది? రేపే పండుగ. రేపటి వఱకు దర్జీవాడు గుడ్డలు కుట్టి యివ్వడు. కుట్టినవే కొనుక్కొస్తాను.

కమల:—మంచిది. అని కాఫీ కప్పు చేతి కందించును.

రామారావు బజారుకు వెళ్లాడు. వాళ్ల నాన్న కొత్త బట్టలు తెస్తాడని లలితా మోహనులు సంతోషంతో ఆడుకుంటున్నారు. కమల వంట యింట్లో కూర్చొని ఏదో దీర్ఘంగా ఆలోచిస్తోంది. ఇంకా వీరు నన్ను పాత కమలనే అనుకుంటున్నారు. కమల మారిన సంగతి వారికేం దెలుసు? పాపం! పగల్లా నేను పడుకుంటున్నాననో, ముచ్చటలు పెట్టుకుంటాననో వారి ఉద్దేశం. కలలోగూడా నేను మంచిపని చేస్తున్నానంటే నమ్మరు. ఇంతలో తొమ్మిది గంటలైంది. రామారావు కాగితములో చుట్టిన కొన్ని గుడ్డలను కమల ముందు పడవేశాడు.

రామారావు:—అబ్బ! అలసిపోయాను. బట్టలు చాలా ప్రియంగావున్నై. ఏ కొట్టులోకి వెళ్లినా ఒకటే ధర!

పాపం పిల్లలు నాన్న వస్తాడు కొత్త బట్టలు తెస్తాడు, అని కూర్చొని, కూర్చొని అప్పుడే పడుకున్నారు.

రామారావు:—పిల్లల గుడ్డలకు పదిహేను రూపాయలైనై. పండుగ ఖర్చుకు యీ అయిదు రూపాయలూ వాడుకొమ్మని కమల చేతిలో పెట్టాడు.

కమల:—మంచిది భోంచెయ్యండి.

రామారావు:—పిల్లలు భోంచేశారా?

కమల:—రెండు మెతుకులుతిని యిప్పుడే పడుకున్నారు.

ఇద్దరూ భోంచేశారు. రామారావు పడుకున్నాడు. కమల వంటయిల్లు సర్ది తానుగూడా పడుకోడానికి వెళ్లింది. రామారావింకా నిద్రపోలేదు. ఏదో ఆలోచిస్తూ పడుకున్నాడు.

కమల:—(దగ్గరికివచ్చి) ఏం ఆలోచిస్తున్నారండీ?

రామా:—ఇంకా నిద్ర రావటంలేదు కమలా! నావంటి దరిద్రుని భార్యవై నీవెంత కష్టపడుతున్నావో ఆలోచిస్తున్నాను.

కమల:—రామరామ! ఎంత మాటన్నారండీ. ఇప్పుడు మనకేం కష్టం జరుగుతుందండీ! ప్రపంచంలో మనకంటే కష్టపడే వారెందరులేరు? భగవంతుడు మనకేం తక్కువచేశాడు? జీవితం గడుపుకోవడానికి కొద్దో, గొప్పో జీతం. ఆత్మశాంతికి వజ్రాలలాంటి యిద్దరు పిల్లలు. ఇక తక్కువేమిటో నాకు చెప్పండి?

రామా:—అయితే ఏం! పండుగకు పట్టుమని పదిరూపాయలుబెట్టి ఒక చీరైనా కొనుక్కురాలేని దౌర్భాగ్యుణ్ణి కమలా నేను?

కమల:—ఓహో? అదా మీ కిప్పుడు విచారం? అయితే నా దగ్గర చీర, ధోవతుల జత యెప్పుడో తయారై ఉన్నై. ఇదిగో చూపిస్తానుండండి, అంటూ, లోపలికివెళ్ళి, ఒక నీలిరంగు చీరా, గులాబిరంగు జాకెట్టూ, ఒక ధోవతులజతా భర్తచేతి కందించింది. అది చూచి రామారావు నివ్వెరపడి కమలా! ఇవెక్కడినుంచి తెచ్చావు? కొంపముంచి అప్పుచేయలేదుగదా!

కమల:—లేదండీ. రోజూ దారంతీస్తూ, నేను ఆ దారంతో తయారుచేసిన బట్టలివి? వీనికై నాలుగు నెలలు కష్టపడ్డాను.

రామా:—నీకు రాట్నమెక్కడిది?

కమల:—మాలతి అక్కయ్య యిచ్చిందండి. దారం తీయటంగూడా ఆమే నేర్పింది. ఇది ఆమె అనుగ్రహమండి.

రామా:—అయితే, నీవు చాలా మంచి పనిచేస్తున్నావన్నమాట. కాని, కమలా! దారం తీయడానికెప్పుడు వెళ్తున్నావు? తీరికే లేదుగా నీకు!

కమల:—పగలు ఒంటిగంటనుండి మూడుగంటలవరకూ వడికి వస్తాను. ఆ తర్వాత యింట్లో పని చేసుకుంటాను. దీనివల్ల నాకు రెండు లాభాలు కలిగాయి. ఒకటి, మిమ్మలను కష్టపెట్టకుండానే మనిద్దరికీ బట్టలు సంపాదించుకోవటం, రెండవది సంసార విషయాలను గురించి విచారపడడానికి నాకు వీలుచిక్కక పోవటం. దారం తీస్తుంటే మనస్సంతా పవిత్రమౌతుందండీ.

రామారావు:—అలాగా కమలా! మనం మన యింటికి ఒక రాట్నం తెచ్చుకుందాము. నాకు దారం తీయటం నేర్పు. మనకు సరిపోయే గుడ్డలకు దారం మనమే తయారు చేసుకోవచ్చు.

కమల:—(ఉత్సాహంతో) అవునండీ. తప్పక మనమూ పనిచేద్దాం.

తెల్లవారింది. ఆ రోజు సంవత్సరాది పండుగ. ఇల్లంతా ఆ చిన్న కుటుంబంతో కళకళ్లాడుతోంది. రామారావు కొత్త బట్టలు కట్టుకొన్నాడు. సంతోషించాడు.

ప్రతి స్త్రీ భర్త కష్టములను తెలిసి కొన్నదైతే, మరి, ఆ యింటికంటే వేరొక స్వర్గం వుండదు. సాంసారిక బంధనాల్లోవుండే స్వల్పలోపాలను సర్దుబాటు చేసుకొనే నేర్పు ప్రతి స్త్రీ అలవరుచుకోవాలి. ఆ రోజాయిల్లాలు భర్తా, పిల్లలతో ఆనందంగా కాలం గడిపింది. పండుగ పిండివంటలకంటేగూడా ఆ శుద్ధఖాదీ ధోవతీ చీరే వారికి ఆనందాన్ని యిచ్చినై. ఆ ఆనందాన్ని ప్రసాదించిన మహాత్ముని చిత్రపటానికి వారు తలవంచకుండా ఉండలేక పోయారు.

—:o:—